

డిగ్రీలో ప్రవేశానికి 'దోస్త్'

డిగ్రీ కళాశాలల్లో చేరికకు ప్రభుత్వం దోస్త్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది.

వివరాలు 8లో ▸



క్రీడలకు పెద్దపీట

సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని కొత్వాల్ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /24.3

ఎండతో పాటు ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన (గురువారం) పిల్లలమర్రి రోడ్డులోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి మైత్రి ప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8 ప్రైవేట్ కంపెనీల్లో 450 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం **99485 68830, 89193 80410** నంబర్లను **సంప్రదించాలని సూచించారు.**

ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలకు **స్థానచలనం కల్పిస్తూ జోగులాంబ** జోన్–7 **డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు** జారీ చేశారు. **కోయిలకొండ ఎస్‌ఐగా పని** చేస్తున్న **భాస్కర్‌రెడ్డిని వీఆర్ వనపర్తికి బదిలీ** చేయగా, **వీఆర్ వనపర్తిలో ఉన్న కె.తిరుపాజీని** కోయిల్‌కొండ **ఎస్‌ఐగా బదిలీ చేశారు.**

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,234

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం వ్యవసాయ పంట దిగుబడులు పోటెత్తాయి. యార్డుకు 7,070 క్వింటాళ్ల పంట ఉత్పత్తులు విక్రయానికి వచ్చాయి. మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,234, కనిష్ఠంగా రూ.1,422 ధరలు లభించాయి. ఆముదాలు గరిష్ఠంగా రూ.6,065, కనిష్ఠంగా రూ.5,990, హంస రకం ధాన్యం గరిష్ఠంగా రూ.1,709, కనిష్ఠంగా రూ.1,600, ఆర్ఎన్ఆర్ రకం గరిష్ఠంగా రూ.2,155, కనిష్ఠంగా రూ.1,601, వేరుశనగ రూ.4,312 ధరలు లభించాయి. నారాయణపేట మార్కెట్‌లో పెసర్లు గరిష్ఠంగా రూ.7,577, కనిష్ఠంగా రూ.5,559 పలికింది. వడ్లు హంస గరిష్ఠంగా రూ.1,550, కనిష్ఠంగా రూ.1,401, వడ్లు సోనా గరిష్ఠంగా రూ.2,079, కనిష్ఠంగా రూ.1,360, ఎర్ర కందులు రూ.5,609, తెల్ల కందులు రూ.6,939 ధరలు పలికాయి.

పీఎఫ్, కేవైసీలో తప్పులు సరిచేయాలి



అమరచింత: పీఎఫ్, కేవైసీలో తప్పులను వెంటనే సరిచేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీడీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ప్రావిడెంట్ ఫండ్ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 2 వేల మంది బీడీ కార్మికులు పీఎఫ్, కేవైసీ కానీ ఫలితంగా తమ పీఎఫ్‌లో జమ చేసుకున్న రూ.కోట్లు అందుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రావిడెంట్ ఫండ్ చట్టం కార్మికుల సంక్షేమం, సోషల్ సెక్యూరిటీ కోసం ఏర్పడిందన్నారు. కానీ, 20 మంది పనిచేసే దగ్గర పీఎఫ్ అమలు చేయాల్సి ఉన్న రాష్ట్రంలో లక్షలాది మంది కార్మిక వర్గానికి అమలు కావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జమ చేసుకున్న డబ్బులను తీసుకోవడం కోసం సరళమైన పద్ధతిలో విత్ డ్రా సిస్టం రూపొందించాలని కోరారు.25 ఏళ్ల కిందట నమోదు చేసుకున్న పేర్లు, ఇంటి పేర్లు, పుట్టిన తేదీలు 2013లో వచ్చిన ఆధార్‌కు తేడా ఉండటంతో పీఎఫ్ కేవైసీలు కావడం లేదని వీటిని వెంటనే పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేయాలని కమిషనర్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. నాయకులు అరుణ్ కుమార్, దేవదానం, బాలకిష్టమ్మ, బాలయ్య, దేవమ్మ పాల్గొన్నారు.



బాదేపల్లి రంగనాయకస్వామి గుట్టను తవ్వేస్తున్న యంత్రం

కొండలు కొల్లగొట్టి.. రూ.కోట్లకు పడగలెత్తి

- జడ్చర్ల పరిధిలో మితిమీరిన మట్టిమాఫియా ఆగడాలు
- ప్రభుత్వ భూములు, గుట్టలలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- బ్లాస్టింగ్‌లు పెట్టి ఆనవాళ్లు లేకుండా చేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

జడ్చర్ల: శతాబ్దాల చరిత్ర కలిగి.. సహజ సిద్ధంగా వెలసిన కొండలు, గుట్టలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. మూగజీవాలు, వన్యప్రాణులకు నిలయంగా ఉన్న కొండలు ఉనికి కోల్పోతున్నాయి. గుట్టలను మలిచి.. రాళ్లను, మట్టిని కొల్లగొట్టి రూ.కోట్లు గడిస్తున్నారు. దర్జాగా గుట్టలను తొలచి వెంచర్లు ఏర్పాటు చేస్తున్న అక్రమార్కుల ఆగడాలను అడ్డుకునేవారే కరువయ్యారు. కళ్ల ముందే నిలువెత్తు గుట్టలు హారతి కర్పూరంలా కరిగిపోతున్నా అధికారులు, పాలకులు చేష్టలుడిగి చూస్తున్నారు. కనీసం వాటి సంరక్షణకు చర్యలు చేపట్టని పరిస్థితి జడ్చర్ల నియోజకవర్గంలో చోటుచేసుకుంటుంది. జిల్లాలోనే అటు పారిశ్రామికంగా.. ఇటు వ్యాపార, వాణిజ్య పరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్ల ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలు, గుట్టల తొలగింపు, తరలింపు విచ్చలవిడిగా కొనసాగుతుంది. ప్రధానంగా ప్రభుత్వ భూముల్లో ఉన్న గుట్టలను లక్ష్యంగా చేసుకొని.. రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీ, హిటాచీ వంటి భారీ యంత్రాలను ఉపయోగించి నిత్యం వేల క్యూబిక్ మీటర్ల మట్టి, రాయి అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో నిలువెత్తు గుట్టలు పిట్టగూళ్లలా మారుతుండగా.. మరికొన్ని ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి.

రూ.కోట్లలో వ్యాపారం..

జడ్చర్ల ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న పరిశ్రమలు, వెంచర్లు, భవన నిర్మాణాలు తదితర వాటికి పెద్దఎత్తున మట్టి అవసరమవుతుంది. ఇందుకు పంట పొలాలు ఉన్న రైతులు మట్టి తరలింపునకు అంగీకరించరు. దీంతో ప్రభుత్వ భూములు, గుట్టలపై కన్నేసిన అక్రమార్కులు పెద్దసంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఇందుకు ఒక ట్రిప్పు మట్టి రూ.3–4 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా కొంతమంది అక్రమార్కులు కలిసి మాఫియాగా ఏర్పడి రాత్రిళ్లు అక్రమ మట్టి తరలింపునకు పూనుకుంటున్నారు. మండలంలోని పోలేపల్లి సెజ్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో కొత్తగా నిర్మిస్తున్న పరిశ్రమలకు పెద్దఎత్తున మట్టి తరలిస్తున్నారు.

దెబ్బతింటున్న పర్యావరణం

గుట్టలకు ముప్పు ఏర్పడటంతో పర్యావరణం కూడా దెబ్బతినే ప్రమాదమేర్పడింది. వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోయింది. దీంతో కొండలు, గుట్టలలో ఉండాల్సిన నెమళ్లు, కోతులు తదితర వన్యప్రాణులు బాహ్య ప్రపంచంలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపు, గుట్టల మాయంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టా పొలాలని బుకాయింపు..

గుట్టలను బ్లాస్టింగ్ చేసి ఎక్కడికక్కడ తునా తునకలు చేస్తున్నారు. గుట్టలను పిప్పి చేసి చదును చేస్తూ ఆనవాళ్లు లేకుండా చేసి భారీ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. అదేమంటే తమపట్టా భూములలో ఉన్న గుట్టలను తొలగిస్తున్నామంటూ బుకాయిస్తున్నారు. వారికి తగ్గట్లుగానే సం**బంధిత అధికారులు తలూపుతున్నారు. నిబంధనల బూచి చూపి అక్రమార్కులకు అధికారులే వంత పాడుతున్నారు.**

కోర్టును ఆశ్రయిస్తాం..



జడ్చర్ల పరిధిలో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ గుట్టలపై కన్నేసిన మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వకాలు జరిపి టిప్పర్లలో తరలిస్తున్నారు. అలాగే గుట్టలను బ్లాస్టింగ్ పెట్టి పేల్చి పిప్పి చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం.

– అనిల్‌కుమార్, సామాజికవేత్త, జడ్చర్ల

చర్యలు తీసుకుంటాం..




ప్రభుత్వ భూములు, గుట్టల నుంచి అక్రమంగా మట్టిని తరలించిన సంఘటనలపై విచారించి చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలించడం చట్టవిరుద్ధం. మట్టి తరలింపును అడ్డుకునే విధంగా సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తాం. గుట్టలను బ్లాస్టింగ్ చేసి తొలగించడంపై కూడా విచారిస్తాం.

– నర్సింగరావు, తహసీల్దార్, జడ్చర్ల

ఎక్కడెక్కడంటే..?

ప్రధానంగా ఈ అక్రమ వ్యాపారం జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్, రాజాపూర్ మండలాల్లో విచ్చలవిడిగా సాగుతుంది. బాదేపల్లి, బూరెడ్డిపల్లి, మల్లెబోయిన్‌పల్లి, చర్లపల్లి శివార్లలోని గుట్టలను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అలాగే హౌసింగ్‌బోర్డు, శంకరాయపల్లి తండా సమీపంలో గుట్టలను సైతం హరిస్తున్నారు. బాదేపల్లి రంగనాయకస్వామి గుట్టకు సైతం ఎసరు పెట్టారు. చర్లపల్లి శివారులో గుట్టను నామరూపాలు లేకుండా చదును చేసి వెంచర్‌కు సిద్ధం చేశారు. శంకరాయపల్లి తండా సమీపంలో దాదాపు 5 ఎకరాల విస్తీర్ణంలో గల బొంగురాల తిప్ప గుట్ట ఇప్పటికే పిట్టగూడుగా మారింది. అలాగే శంకరాయపల్లి తండా సమీపంలోని సర్వే నం.385లో గుట్టను తవ్వేశారు. జడ్చర్లలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వెనుక ప్రాంతంలో జాతీయ రహదారి–44 పక్కన గుట్టను బ్లాస్టింగ్ పెట్టి ఆనవాళ్లు లేకుండా చేశారు. హౌసింగ్‌బోర్డు పక్కనే గల మరో గుట్టపై అక్రమార్కుల కన్ను పడింది. గత కొన్ని నెలలుగా భారీ యంత్రాలను పెట్టి గుట్టలను తవ్వి ఓ వైపు మట్టిని తరలించి సొమ్ము చేసుకోవడంతోపాటు వెంచర్ ఏర్పాటుకు చదును చేస్తున్నారు. అలాగే మిడ్జిల్ మండలంలోని కేఎల్ఐ కాల్వ కట్ట నుంచి యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నారు.



జడ్చర్ల శివారులో బ్లాస్టింగ్ చేసి ఆనవాళ్లు లేకుండా చేసిన గుట్ట

స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కల్వకుర్తి టౌన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించడమే కాకుండా, వారికి అందివచ్చిన స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీ మల్లురవి అన్నారు. మంగళవారం పట్టణంలోని మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం మహిళలకు కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి కుట్టుమిషన్లు అందించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వర్గానికి సమానంగా నిధులు కేటాయిస్తూ.. వారిలో ఉన్న ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. స్వయం శక్తితో ఎదిగి కోటీశ్వరులు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడేందుకే రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు.



లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్

1,24,890 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం

- కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గతం కంటే 6.5 రెట్లు వేగవంతంగా రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ విజయేందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా వడ్ల కొనుగోలు జరుగుతోందని, రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. జిల్లాలో యాసంగి మార్కెటింగ్ సీజన్ మే 20 నాటికి 2023–24లో 110 కొనుగోలు కేంద్రాల ద్వారా 19,052 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈ ఏడాది 192 కొనుగోలు కేంద్రాల ద్వారా 23,410 మంది రైతుల నుంచి రూ.289.75 కోట్ల విలువ గల 1,24,890 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 17,587మంది రైతులకు రూ.212.60 కోట్లు చెల్లింపులు పూర్తి చేశామని, మిగిలినవి కూడా రెండు రోజుల్లో చెల్లిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన ధాన్యంలో 85,760 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేశామని, ఇందుకు సంబంధించి రైతులకు రూ.42.88కోట్ల బోనస్ కూడా చెల్లించినట్లు తెలిపారు. భారతఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నామని వివరించారు. జిల్లాలో రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, కొనుగోలు కోసం 47.5 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా.. ఇప్పటికే 39.50లక్షల బస్తాలను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. వచ్చే 15 రోజుల్లో మిగిలిన ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించే కార్యాచరణను రూపొందించామని, వర్షాల వలన ధాన్యం ఎక్కడ పాడవకుండా మార్కెటింగ్ శాఖ ద్వారా అవసరమైన టార్పాలిన్ కవర్లను పంపించామని వివరించారు.

టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్‌లో చేరేలా చూడాలి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయేందిర, జిల్లా అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వపాఠశాలలో పదవ తరగతి చదివిన వారందరూ ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులను ఫోన్ ద్వారా సంప్రదించి వారు ఏ కళాశాలలో చేరాలనుకుంటున్నారో ఆ వివరాలను తెలుసుకోవాలని సూచించారు. వ్యక్తిగతంగా తల్లిదండ్రులను కలిసి విద్యార్థులను ఇంటర్మీడియట్‌లో చేర్పించాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఏడాది ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండడంపై ఆరా తీసిన కలెక్టర్.. వచ్చే ఏడాది మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. చదవడం, రాయడం రాని విద్యార్థుల మీద మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థికి తెలుగుతో పాటు ఇంగ్లిష్, హిందీ భాషల్లో రాయడం, చదవడం రావాలన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి వారిని సమీపంలోని భవిత కేంద్రాల్లో చేర్పించాలన్నారు. బడులు తెరిచే నాటికి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో ఏమైనా మరమ్మతులు ఉంటే చేయించాలన్నారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా నిర్వహించాలన్నారు. రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్లడానికి వీలుకాని వారు తెలంగాణ ఓపెన్ పాఠశాల ద్వారా టెన్త్, ఇంటర్ చదువుకునేందుకు ఆన్ లైన్, ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ తీసుకోవచ్చని తెలిపారు. అనంతరం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) వాల్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈఓ ప్రవీణ్ కుమార్, డీఐఈఓ కౌసర్ జహాన్, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, డీడబ్ల్యూఓ జరీనా బేగం, సీఎంఓ బాలుయాదవ్, ఆర్‌సీఓలు, డీసీఓలు పాల్గొన్నారు.

అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆదర్శనగర్‌లోని దివ్యాంగుల కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఈ కాలనీలో పర్యటించి అక్కడి సమస్యలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతం లో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని, వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మించిన పోచమ్మతల్లి ఆలయాన్ని ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు.



ఆదర్శనగర్‌లోని దివ్యాంగుల కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వివరిస్తున్న ఓ వృద్ధురాలు

పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణ లో, అలాగే క్లాక్‌టవర్ వద్ద ముడా నిధులతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్లతో పాటు వీధి వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్‌-షాపులను ప్రారంభించారు. అనంతరం వివిధ పోటీ పరీక్షల కోసం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంగా జీవించాలన్నదే తమ లక్ష్యమన్నారు. రానున్న పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో స్థిరపడాలని యువతకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు హన్మంతు, శివశంకర్, ఎం.రాజు, జె.చంద్రశేఖర్, కావలి కాశీం, బేదురి యాదయ్య, తిరుపతయ్య, ఫయాజ్, శ్రీనివాస్‌యాదవ్, గుండా మనోహర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న చెంతకు.. నాలుగు వరుసల రోడ్డు

- హైదరాబాద్– డిండి, మన్ననూర్ రహదారికి మహర్దశ
- రూ.2,800 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్‌–765 నిర్మాణం
- మన్ననూర్– శ్రీశైలం మధ్య ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు
- స్వయంగా ప్రకటించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- మూడు నెలల్లో టెండర్ ప్రక్రియ.. శ్రీశైలానికి తప్పనున్న ప్రయాణ పాట్లు

విస్తరణకు గ్రీన్‌సిగ్నల్



హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారి

అచ్చంపేట: మల్లికార్జునస్వామి కొలువై ఉన్న నల్లమల అభయారణ్య ప్రాంతంలో ఆహ్లాదకరమైన ప్రయాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. అన్ని అడ్డంకులను అధిగమించుకొని హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారి–765 త్వరలోనే నాలుగు వరుసలుగా మారనుంది. రెండు వరుసలుగా ఉన్న ఈ రోడ్డును నాలుగు లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవేగా త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. రూ.2,800 కోట్లతో ఈ రోడ్డును విస్తరిస్తామని, మూడు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తిచేసి.. పనులు ప్రారంభిస్తామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా ప్రకటించారు. హైదరాబాద్– డిండి, బ్రాహ్మణపల్లి (మన్ననూర్) 105.6 కి.మీ., గ్రీన్‌ఫీల్డ్ హైవేతో పాటు మన్ననూర్– శ్రీశైలం మధ్య ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే 6 గంటల ప్రయాణ సమయం 3 గంటలకు తగ్గనుంది. శ్రీశైలం దారిలోని తుక్కుగూడ– డిండి వరకు ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌ను తొలగించే పని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని కేంద్రం కోరింది.

అత్యంత కీలక మార్గం

హైదరాబాద్– శ్రీశైలం– తోకలపల్లి జాతీయ రహదారి–765 రెండు తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైంది. దక్షిణకాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్‌తో అనుసంధానించే ఎన్‌హెచ్–765లో 125 కి.మీ., దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉంది. వన్యప్రాణులు తిరిగే 62.5 కి.మీ., ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తూ మిగతా ప్రాంతంలో భూ భాగంలోనే రోడ్డును విస్తరిస్తారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి హైదరాబాద్ నుంచి వెళ్లే భక్తులు తుక్కుగూడ, కందుకూరు, కడ్తాల్, మైసిగండి, ఆమనగల్, డిండి, మన్ననూర్ మీదుగా ప్రయాణిస్తారు. తెలంగాణ నుంచి తిరుపతికి వెళ్లే భక్తులు ఈ మార్గం గుండానే వెళ్తారు. ప్రస్తుతం ప్రతిరోజు సగటున 7,750 వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని రవాణా శాఖ అంచనా. శని, ఆదివారాల్లో అయితే ఈ సంఖ్య 10 వేలకు చేరుతుంది. ఇక 2027 నాటికి 12,200, 2040 నాటికి 27,580కి చేరుతుందని ట్రాఫిక్ అధ్యయనంలో తేలింది. అయితే ఈ రహదారి నల్లమల అటవీ గుండా సాగుతోంది. సుమారు 56 కి.మీ., మార్గం అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఉండటంతో పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల సంచారం ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణకు గతంలో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో అటవీ మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

ప్రమాదాలకు నెలవు..

హైదరాబాద్– శ్రీశైలం రహదారిపై పెరిగిన వాహనాల రద్దీతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. గతంలో పోలిస్తే ప్రస్తుతం ఈ హైవేపై వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలోనే రహదారిపై తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో ప్రయాణికులు మృత్యువాత పడుతుండగా మరికొందరు క్షతగాత్రులుగా మారుతున్నారు. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు విస్తరించకపోవడంతో పాటు మధ్యలో డివైడర్ లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

డీపీఆర్ రూపొందించారు..



హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారి త్వరలోనే నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. ఇప్పటికే డీపీఆర్ రూపొందించారు. మహేశ్వరం గేటు నుంచి డిండి వరకు సర్వే పనులు కొనసాగుతున్నాయి. మూడు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తారు. అలాగే మన్ననూర్– శ్రీశైలం మార్గంలో వన్యప్రాణులను దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రతిపాదించారు. దీనిపై కూడా కేంద్ర ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది.

– మల్లురవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

అనుసంధానంగా మరో రెండు..

ఎన్‌హెచ్–765కి అనుసంధానంగా కల్వకుర్తి (కొట్ర గేట్)–నంద్యాల–167కే జాతీయ రహదారి ఏర్పాటవుతుంది. అలాగే సోమశిల ఐకానిక్ బ్రిడ్జి పూర్తయితే హైదరాబాద్ నుంచి తిరపతి వెళ్లే ప్రయాణికులకు 80 కి.మీ., దూరభారం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్– శ్రీశైలం హైవేలోని కల్వకుర్తి వరకు ట్రాఫిక్ మరింత పెరగనుంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న రెండు వరుసల ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం అంత సులువు కాదు. దీంతో హైదరాబాద్– శ్రీశైలం రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని కొన్నేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరుతున్నాయి. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో మూడు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

క్లుప్తంగా

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

- మద్యం తాగొద్దన్నందుకు.. చెట్టుకు ఉరేసుకున్న వైనం

రాజాపూర్: మద్యం తాగొద్దని తనయుడు తల్లికి చెప్పినందుకు మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. చెన్నవెల్లి గ్రామానికి చెందిన పొట్ట పద్మమ్మ(62) మద్యానికి బానిస కావడంతో హైదరాబాద్‌లో ఉన్న కుమారుడు శ్రీనివాసులు రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చి తల్లితో ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పద్మమ్మ మద్యం తెచ్చుకుని తాగుతుండగా కుమారుడు శ్రీనివాసులు మందలించి ఇంటిపై నిద్రించాడు. మధ్యరాత్రి లేచి చూచేసరికి తల్లి కనిపించక పోవడంతో చుట్టు పక్కల గాలించాడు. మంగళవారం ఉదయం గ్రామ శివారులో ఉన్న మర్రిచెట్టుకు పద్మమ్మ ఉరేసుకొని వేలాడుతున్న విషయాన్ని గమనించి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతురాలి కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

ప్రసవానికి వస్తే ప్రాణం పోయింది


మృతిచెందిన రేణుక (25)

కల్వకుర్తి టౌన్: ప్రసవ సమయంలో అధిక రక్తస్రావంతో బాలింత మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన రేణుక (25)కు వెంకటేష్‌తో 2024లో వివాహం జరిగింది. పురిటి నొప్పులతో పట్టణంలోని శ్రీసాయి ఆస్పత్రికి ఆదివారం రాత్రి తీసుకురాగా వైద్య సిబ్బంది ప్రసవం చేశారు. ఆడబిడ్డకు జన్మనిచ్చిన రేణుక ప్రసవం అనంతరం అధిక రక్తస్రావం అవుతుండటంతో సోమవారం సాయంత్రం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో రేణుక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలింత మృతి చెందిందని మృతదేహాన్ని తిరిగి కల్వకుర్తిలోని శ్రీసాయి ఆస్పత్రికి వద్దకు తీసుకొచ్చి బాధిత కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఓ నాయకుడు, మరో పోలీస్ అధికారి రాజీ కుదిర్చి బాధిత కుటుంబానికి పరిహారాన్ని ఇచ్చేలా ఒప్పందం కుదిర్చినట్లు తెలిసింది. పట్టణంలోని ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నా వైద్యారోగ్య శాఖ అధికారులు పట్టించుకోకపోవటం, నాయకులు వెంటనే రాజీ కుదర్చటం పరిపాటిగా మారిందని పట్టణ ప్రజలు జోరుగా చర్చించుకుంటున్నారు.

అంబేడ్కర్ అడుగుజాడలే దిశానిర్దేశం



రాజోళి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే అడుగు జాడల్లో నడుస్తూ.. ఆయన ఆశయాలను నెరవేర్చాలని ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. మండలంలోని పెద్ద దన్వాడలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యం వైపు వెళ్లే క్రమంలో ఎన్నో అడ్డంకులు వస్తుంటాయని, వాటిని దీటుగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. యువతకు మహనీయులు అంబేడ్కర్, పూలే జీవితాలే ఆదర్శమన్నారు. కలిసికట్టుగా పోరాడితే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ రఘు, యువత, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

షా-అలీ-పహిల్వాన్ ఉర్సు ప్రారంభం

అలంపూర్ : అలంపూర్ పట్టణంలో వెలసిన షా-అలీ-పహిల్వాన్ ఉర్సు మంగళవారం రాత్రి గంధోత్సవంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్ ముబారక్, ధడ్ ముబారక్ దర్గాలను ముస్తాబు చేశారు. ఉత్సవాలను తిలకించడానికి వచ్చే భక్తులకు నిర్వాహక కమిటీ తగు సౌకర్యాలు కల్పించింది. ఉత్సవాల నాలుగు రోజుల పాటు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తరతరాల సంప్రదాయాలకు స్వాగతం పలుకుతూ ఉత్సవాలను కొనసాగించారు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా ఖాజ బందేనవాజ్ దర్గా నుంచి వచ్చిన గంధంతో ఉత్సవాలను ప్రారంభించారు.

డిగ్రీలో ప్రవేశానికి ‘దోస్త్’

నేటితో ముగియనున్న మొదటి దశ దరఖాస్తుల గడువు


పీయూ ముఖద్వారం

- మూతబడ్డ 24 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు
- దరఖాస్తు చేసుకోని 12 కళాశాలలు
- 74 కళాశాలల్లో 31వేల అడ్మిషన్లకు అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: 2025-26 విద్యా సంవత్సారానికి సంబంధించి పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మొదటి దశలో భాగం 21 వరకు నేరుగా ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం ఉంది. 29న అలాట్‌మెంట్, 30 నుంచి వచ్చే నెల 6 వరకు కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. పీయూ పరిధిలో మొత్తం 74 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉండగా.. 31వేల డిగ్రీ సీట్లను భర్తీ చేయనున్నారు.

ఉపాధి ఆధారిత కోర్సులు..

కొన్నేళ్లుగా పీయూ పరిధిలో మొత్తం ఉన్న సీట్లలో కనీసం 65శాతం సీట్లు కూడా భర్తీ కాని పరిస్థితి ఉంది. ఇందుకు కారణం సాంప్రదాయ బీఏ, బీకాం వంటి కోర్సుల చదవడం వల్ల పూర్తి స్థాయిలో ఉద్యోగ అవకాశాలు దొరకడం లేదనే వాదనలు ఉన్నాయి. దీన్ని గమనించిన ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థులకు మూడేళ్ల డిగ్రీ కాలంలో రెండేళ్లు కళాశాలలో తరగతులు.. చివరి సంవత్సరం అప్రెంటిషిప్ ఉంటుంది. ఈ క్రమంలో విద్యార్థికి వేతనం సైతం లభిస్తుంది. ఇటువంటి కోర్సులు ఎంవీఎస్‌లో 5, ఎన్టీఆర్‌లో 2, బీఆర్ఆర్‌తో పాటు మరిన్ని కళాశాలలకు అవకాశం కల్పించారు. అందులో బీఎస్సీ డిజిటల్ మార్కెటింగ్‌కు ఇంటర్‌లో ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు, బీఎస్సీ మార్కెటింగ్, ఫార్మా సేల్స్, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌కు బైపీసీ, బీకాం బీఎఫ్ఎస్ఐకి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

మెరుగైన విద్య అందించడమే లక్ష్యం



పీయూ పరిధిలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అందుకే ప్రైవేటు కళాశాలల్లో ర్యాటిఫికేషన్, అఫ్లియేషన్ ప్రక్రియ చేపట్టాం. దీంతో ప్రతి విద్యార్థి మంచి బోధన, వసతులు పొందగలుగుతారు. నూతన విద్యావిధానంలో భాగంగా ప్రభుత్వం రెండేళ్లు కళాశాలలో చదవడం, మూడో సంవత్సరం అప్రెంటిషిప్ చేసుకునే విధంగా కొత్త కోర్సులను తీసుకొచ్చింది. ప్రభుత్వం కొత్త డిగ్రీ, గురుకుల కళాశాలలు తీసుకొచ్చింది. కొన్ని కళాశాలల్లో సీట్ల సంఖ్య పెంచింది. వాటిలో చేరితే ఆర్థిక భారం తగ్గుతుంది.

– శ్రీనివాస్, వీసీ , పీయూ

దరఖాస్తు చేసుకోలేదు



పీయూ పరిధిలోని పలు కళాశాలలు ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు తీసుకునేందుకు అఫ్లియేషన్ కోసం దరఖాస్తులు చేసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న అన్ని కళాశాలలకు అడ్మిషన్లకు అవకాశం కల్పించాం. మారుమూల ప్రాంతాల విద్యార్థులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ, గురుకుల కళాశాల్లో అడ్మిషన్లు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

– రమేష్‌బాబు, రిజిస్ట్రార్, పీయూ

కష్టాల్లో ప్రైవేట్ కళాశాలలు..

ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయని కారణంగా పీయూ పరిధిలోని పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక భారంతో కళాశాలలను మూసివేసే పరిస్థితి నెలకొంది. ఐదేళ్లుగా 12 కళాశాలలు మూతబడితే.. ఈ ఏడాది ఏకంగా మరో 12 కళాశాలలు మూతబడ్డాయి. వాటిలో మహబూబ్‌నగర్ జిల్లాలో 5, నాగర్‌కర్నూల్‌లో 7, నారాయణపేట్‌లో 3, రంగారెడ్డి 3, వికారాబాద్ 1, వనపర్తి 3, గద్వాల ఒక కళాశాలలు ఉన్నాయి. దీంతో గ్రామీణ విద్యార్థులు చదువులకు దూరయ్యే అవకాశాలు ఉన్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లాలో 6 కొత్త కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది.

భూ సేకరణ పనుల్లో వేగం పెంచాలి


సమీక్షలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రవి నాయక్, కలెక్టర్ విజయేందిర తదితరులు

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల భూ సేకరణ, పునరావాస పనులను వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి.రవి నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో కలెక్టర్ విజయేందిరతో కలిసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండపూర్ రిజర్వాయర్ నిర్మాణం భూ సేకరణ, ఆర్అండ్ఆర్ పనులను, కోయిల్ సాగర్, మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకాల భూ సేకరణపై ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, మిషన్ భగీరథ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉదండపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా జడ్చర్ల మండలంలోని వల్లూర్, ఉదండపూర్, తుమ్మలకుంటతండా, రేగడిపట్టితండా, చిన్నగుట్టతండా, ఒంటిగుడిసెతండా, శామగడ్డతండాలు ముంపునకు గురవుతున్నట్లు అధికారులు వివరించారు. దీంతో జడ్చర్ల మండలంలోని ఖానాపూర్, ఉదండాపూర్, వల్లూరు, పోలేపల్లి, కిస్టారం రెవెన్యూ గ్రామాలు, నవాబ్‌పేట మండలం లోని తీగలపల్లి, కారుకొండ, సిద్దోటం రెవెన్యూ గ్రామాల్లో 4887.035 ఎకరాల వ్యవసాయ భూముల భూ సేకరణకు గాను 4876.185 ఎకరాలు భూసేకరణ చేసినట్లు, ఉదండపూర్ రెవెన్యూ గ్రామంలో 1453.33 ఎకరాలకు గాను 1443.09 ఎకరాలు సేకరించామని ఇంకా 10.24 ఎకరాలు భూ సేకరణ చేయవలసి ఉందని వివరించారు. వల్లూర్, ఉదండాపూర్, తుమ్మలకుంటతండా, రేగడిపట్టితండా, చిన్నగుట్టతండా, ఒంటిగుడిసెతండా, శామగడ్డతండా, పోలేపల్లి ఆవాస ప్రాంతాల్లో 1954 గృహాల కోసం 60.26 ఎకరాల భూ సేకరణకు నోటిఫై చేసినట్లు తెలిపారు. 667 గృహాలకు అవార్డ్ పాస్ చేసినట్లు, 510 గృహాలకు టోకెన్‌లు జనరేట్ చేసినట్లు ఇంకా బ్యాలెన్స్ 161 గృహాలకు టోకెన్లు జనరేట్ చేయాల్సి ఉందన్నారు. ఆర్అండ్ఆర్ కింద తుమ్మల కుంటతండా, రేగడిపట్టితండా, చిన్నగుట్టతండా, శామగడ్డతండా, ఒంటిగుడిసెతండా, పోలేపల్లి నిర్వాసిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. జడ్చర్ల మండలంలోని నిర్వాసితులకు పోలేపల్లిలో 125.13 ఎకరాలను, జడ్చర్లలో 149.19 ఎకరాలు మొత్తం 274.32 ఎకరాలను పునరావాస కాలనీలుగా ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే ఆర్అండ్ఆర్ లోకేషన్ 1, 2 లలో మౌలిక వసతుల పనులు చేపట్టినట్లు వివరించారు. అనంతరం కోయిల్‌సాగర్, మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకాల భూసేకరణ పనులను సమీక్షించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, సాగునీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ బి.వి.రమణారెడ్డి, ఎస్ఈ చక్రధరం, ఆర్‌డీఓ నవీన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ పుల్లారెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు ఆరోపణలు అవాస్తవం


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

- సీఎం సభ సందర్భంగా ఎవరిని అరెస్టు చేయలేదు
- సభ విజయవంతం కావడంతోనే విమర్శలు
- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట: అమ్రాబాద్ మండలం మాచారంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎంను కలిసేందుకు వచ్చిన చెంచులను నిర్బంధించి, అరెస్టు చేశారని మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణల్లో నిజం లేదని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 2016లో మన్ననూర్‌లో చెంచుల మరణాలపై పుస్తకం ఆవిష్కరించినా హరీశ్‌రావు.. 10 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు చెంచుల గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెంచులకు హైదారాబాద్‌లో కార్పొరేట్ వైద్యసేవలు అందించేవారని, బీఆర్ఎస్ హయంలో ఎందుకు అందించలేదని మండిపడ్డారు. జీవీవీకేలు, జీసీసీలను గత ప్రభుత్వం ఊపిరి తీస్తే.. తమ ప్రభుత్వం ఊపిరి పోస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వం చెంచులకు ఇచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను లాక్కునే ప్రయత్నం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిర సౌరగిరి జల వికాస పథకం ద్వారా చెంచులను ఆదుకోనేందుకు రూ.12,600 కోట్లతో పండ్ల తోటల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. చెంచులకు పక్కా ఇళ్లు కట్టించేందుకు మరో వెయ్యి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం స్వయంగా ప్రకటించడం చెంచుల పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధి ఎంటో అర్థమవుతుందన్నారు. త్వరలోనే సలేశ్వరం లింగమయ్యను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్ది విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గౌరీ శంకర్, మాజీ ఎంపీపీ రామనాథం, నర్సయ్య యాదవ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్
- శుభారంభం చేసిన మహబూబ్‌నగర్ జట్టు


మహబూబ్‌నగర్ జట్టుతో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ క్రీడలు: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో జరుగుతున్న అండర్-23 పురుషుల ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ రెండోరోజు మంగళవారం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. క్రికెట్ అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి జిల్లా క్రికెట్ సంఘం ఎంతో పాటుపడుతున్నట్లు తెలిపారు.క్రీడాకారులను ప్రోత్సహించేలా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. అనంతరం కొత్వాల్ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అండర్-23 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో రెండో రౌండ్ లీగ్ మ్యాచులు జరుగుతాయని అన్నారు. క్రీడాకారులు లీగ్ మ్యాచుల్లో తమ వ్యక్తిగత ప్రదర్శనను చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్ గోపాలకృష్ణ, సీనియర్ క్రీడాకారుడు అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఇన్నింగ్స్ విజయం

ఇంట్రా డిస్ట్రిక్ట్ అండర్-23 టూడే లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు శుభారంభం చేసింది. మహబూబ్‌నగర్ జట్టు ఇన్నింగ్స్ 49 పరుగుల తేడాతో జడ్చర్ల జట్టుపై విజయం సాధించింది. 255 పరుగుల ఆధిక్యంతో మహబూబ్‌నగర్ ఉండగా రెండో రోజు రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన జడ్చర్ల జట్టు 40 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 206 పరుగులకు చేసింది. కేతన్‌కుమార్ యాదవ్ అజేయ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. 106 బంతుల్లో 16 ఫోర్లతో 101 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మహబూబ్‌నగర్ బౌలర్లు షాదాబ్ 2, శశాంక్ 2, డేవిడ్ క్రిపాల్ ఒక వికెట్ తీశారు. మ్యాచ్‌ను ఇన్నింగ్స్ తేడాతో గెలుపొందడంతో మహబూబ్‌నగర్ జట్టు బోనస్‌పాయింట్‌తో కలిపి ఆరు పాయింట్లు సాధించింది.

‘దేశం అభివృద్ధి చెందితే కాంగ్రెస్ సహించలేదు’


మాట్లాడుతున్న మాధవీలత

- ప్రజాధనం వృథాను అరికట్టేందుకే జమిలి ఎన్నికలు
- బీజేపీ రాష్ట్ర నాయకురాలు మాధవీలత

వనపర్తిటౌన్: ప్రధాని మోదీ జమిలి ఎన్నికలు నిర్వహిస్తామంటే కాంగ్రెస్ అడ్డుపడుతోందని, దేశం అభివృద్ధి చెందితే ఆ పార్టీ సహించలేదని బీజేపీ రాష్ట్ర నాయకురాలు మాధవిలత ఎద్దేవా చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వన్ నేషన్ వన్ ఎలక్షన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పార్లమెంట్, శాసనసభ ఎన్నికలు విడివిడిగా నిర్వహించడంతో అత్యధిక కాలం ఎన్నికల కోడ్ అమలులో ఉండి సంక్షేమ పథకాల అమలుకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల పేరుతో ఏటా రూ.లక్షల కోట్ల ప్రజాధనం వృథా అవుతోందని, ఈ ఆటంకాలను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం ఒకే దేశంలో ఒకే ఎన్నిక చట్టం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దేశంలో ప్రతి ఓటుకు ఎలక్షన్ కమిషన్ రూ.1,475 ఖర్చు చేస్తుందని, పార్లమెంట్ ఎన్నికలకు రూ. 6లక్షల కోట్లు, శాసనసభ ఎన్నికలకు రూ.3లక్షల కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ఇవే కాకుండా శాసనమండలి, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, సర్పంచ్, సింగిల్‌విండో ఎన్నికల నిర్వహణకు లెక్కలేనంత డబ్బులు ఖర్చవడంతో పాటు అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, కార్యక్రమం జిల్లా ఇన్‌చార్జ్ అహన్యరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, ఓబీసీ మోర్చా నాయకుడు బి.శ్రీశైలం, రామన్‌గౌడ్, జ్యోతిరమణ, సుమిత్రమ్మ, కుమారస్వామి, సీతారాములు, పెద్దిరాజు, మనివర్ధన్, బోయల రాము, రాజశేఖర్‌గౌడ్, అశ్వినిరాధ, రాఘవేందర్ గౌడ్, వారణాసి కల్పన, ఎండీ ఖలీల్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు

పశ్చిమ బెంగాల్‌కు తల్లి, బిడ్డ తరలింపు


తల్లి, బిడ్డతో సఖి బృందం సభ్యులు

పాలమూరు: జడ్చరలోని సఖి కేంద్రంలో ఉంటున్న సంజన అలాగే ఆమె బిడ్డను సఖి కేంద్రం నిర్వాహకులు పశ్చిమబెంగాల్‌కు పంపించారు. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమబెంగాల్‌కు చెందిన సంజన భర్తతో కలిసి కూలి పనులు చేసుకోవడానికి జడ్చర్ల వచ్చారు. అయితే గొడవ జరగడంతో భర్త ఆమెను ఒంటరిగా వదిలేసి పశ్చిమ బెంగాల్ వెళ్లిపోయాడు. గర్భిణీగా ఉన్న ఆమె గత జనవరిలో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆర్థిక సమస్యలతో పుట్టిన బిడ్డను అమ్మే ప్రయత్నం చేయగా గమనించిన ఆస్పత్రి సిబ్బంది సఖి కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో వారు నాలుగు నెలల పాటు తల్లిబిడ్డకు ఆశ్రయం కల్పించారు. అయితే సంజన పూర్తి వివరాలు తెలియడంతో ఆమె తల్లిదండ్రులతో మాట్లాడి మంగళవారం స్వగ్రామానికి పంపించారు. ప్రత్యేక బృందంతో తల్లి, బిడ్డను పశ్చిమ బెంగాల్‌కు తరలించినట్లు సఖి కేంద్రం కో-ఆర్డినేటర్ సౌజన్య తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ధన్వాడ: మండల కేంద్రనికి చెందిన ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కాపర్తి చంద్రశేఖర్ మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం నారాయణపేట నుంచి ధన్వాడకు బైక్‌పై వస్తుండగా పంది అడ్డుగా రావడంతో పందిని ఢీకొని కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. 108లో నారాయణపేట జిల్లా కేంద్రానికి, అనంతరం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ క్రమంలో చంద్రశేఖర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.


బ్రిడ్జిపై అడ్డంగా నిలిచిన లారీ


హైస్కూల్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వాహనాలు


పట్టణంలోకి వెళ్లే మార్గంలో నిలిచిన వాహనాలు

సిగ్నల్‌గడ్డ బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్‌జాం

జడ్చర్ల సిగ్నల్‌గడ్డ బ్రిడ్జిపై మంగళవారం ఓ లారీ ఆకస్మికంగా బ్రేక్ డౌన్ కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే సిగ్నల్‌గడ్డ బ్రిడ్జి విస్తరణ పనుల నిలిపివేసిన క్రమంలో ఇరుకుగా ఉన్న బ్రిడ్జిపై లారీ మొరాయించడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ద్విచక్ర వాహనాలు, చిన్న చిన్న వాహనాలు బాదేపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కిందుగా వెళ్లినా.. భారీ వాహనాలు మాత్రం బ్రిడ్జిపై నిలిచిపోయాయి. అనంతరం లారీకి మరమ్మతు చేసి తొలగించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. – జడ్చర్ల/జడ్చర్లటౌన్